క్లుప్తంగా

గుడికి రూ.లక్ష విరాళం అందించిన ఎమ్మెల్యే



గుడికి విరాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : కొండాపురం మండల పరిధిలోని వెంకయ్య కాలువ గ్రామంలో నూతంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి గుడికి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి రూ.1 లక్ష నగదు అందజేశారు. మంగళవారం ఎర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ నగదును గుడి నిర్వాహకులు ఎమ్మెల్యే నుంచి అందుకున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో ప్రభుత్వ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత అడ్మిషన్‌ల కోసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 27వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30వతేదీన ఉదయం పది గంటలకు జమ్మలమడుగు, మైలవరం ఐటీఐలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేద కుటుంబానికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా కోవరంగుంటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ బలపనూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ శాశ్వత భవనం ప్రారంభానికి సిద్ధమైంది. మెరుగైన వైద్యం తమకు అందనుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కొత్తపల్లెకు ఎంపీ రాక

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె గ్రామానికి బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభిస్తారన్నారు. అనంతరం సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలతో సమావేశమై సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

చిన్న పిల్లలను పనులలో ఉంచుకుంటే చర్యలు



ఇటుకల బట్టీలలో తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ ప్రసాద్

ఎర్రగుంట్ల : కష్టతరమైన పనులలో, ఇతర పనులలో చిన్న పిల్లలను ఉంచుకుంటే ఆ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమలాపురం లేబర్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఎర్రగుంట్ల పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలను బడులలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఇటుకల బట్టీలు, పాలీష్ మిషన్ ఫ్యాక్టరీలలో తనిఖీ చేశామన్నారు.

పుష్పగిరి గుట్ట సర్వే



పుష్పగిరి గుట్ట సర్వే నిర్వహిస్తున్న మండల సర్వేయర్ సర్వేశన్

వల్లూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పుష్పగిరి గుట్టను అధికారులు మంగళవారం సర్వే చేశారు. వల్లూరు మండల సర్వేయర్ సర్వేశన్ ఆధ్వర్యంలో రెవెన్యూ రికార్డుల ఆధారంగా డీజీపీఎస్ రోవర్ ద్వారా సర్వేను నిర్వహించారు. కోట్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని 1077 సర్వే నంబర్‌లో 730. 53 ఎకరాల విస్తీర్ణంలో వున్న పుష్పగిరి గుట్టకు సంబంధించి తూర్పు వైపున సరిహద్దులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి ఆలయ ఈఓ మహేశ్వర్ రెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు సుబ్బరాయుడు, మహేష్, వీఆర్‌ఓ నరసింహులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరుటౌన్‌లోని రాజులకాలనీ, సరస్వతీనగర్, కొత్త గాంధీనగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆయన తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయులురెడ్డికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మరథం పట్టారు, ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. అంతే కాకుండా ఆయా కుటుంబాలలో ఏయే సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకుని వాటిని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఒకవేళ ఏదైనా సమస్య వల్ల ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక్కడ కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ దిలీప్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌పీఎస్‌ఆర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, కమలాపురం నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాషా, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న వంతెన నిర్మాణ పనులు



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామ సమీపంలోని వాగులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులో నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ఏడాది వాగులో ఇద్దరు వ్యక్తులు ఇరుక్కుపోయారన్నారు. వెంటనే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి తెలియజేయడంతో జిల్లా స్థాయి యంత్రాంగాన్ని ఇక్కడికి రప్పించి వారిని రక్షించారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పందించి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.57లక్షల నిధులు మంజూరు చేయించి వాగుపై వంతెన నిర్మించడంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే సీఎం లక్ష్యం

పులివెందుల రూరల్ : మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన స్థానిక బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న మెప్మా కార్యాలయంలో ఆదిత్యా బిర్లా కంపెనీలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు 18ఏళ్ల నుండి 32ఏళ్ల వయస్సు గల మహిళలు హాజరు కావాలని కోరారు. ఎంపికైన మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఇలాంటి బహుళ జాతీయ సంస్థలో ఉద్యోగం లభిస్తే వివిధ రకాల అలవెన్స్‌లతోపాటు కుటుంబ సభ్యులకు ఆరోగ్య పాలసీ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు పొందవచ్చన్నారు.

జమ్మలమడుగులో 27న జనవిజ్ఞాన వేదిక మహాసభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న డాక్టర్ ఆగస్టీన్‌రాజ్

జమ్మలమడుగు : ఈనెల 27వతేదీన జన విజ్ఞాన వేదిక 17వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞానవేదిక పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, మహేష్ నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.అగస్టీన్ రాజ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వతేదీ ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలోని సభాభవనంలో మహాసభలను నిర్వహిస్తామన్నారు. మేధావులు, విద్యార్థులు హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో దాతలు

కమలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వెంకట సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీడీ కాలనీ, రామచంద్రాపురం ఎంపీపీ పాఠశాలలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులకు కమలాపురం గ్రేటర్ వాసవీ క్లబ్ ఆర్య వైశ్యులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఏటా చేయూత అందిస్తామన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ భోజనపాటి సుధాకర్, ట్రెజరర్ గాజులపల్లె చంద్రశేఖర్ ఉపాధ్యాయులు నాగమణి, జయలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

పెండ్లిమర్రి : రైతులు పండించిన ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి కోరారు. పెండ్లిమర్రిలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో అవకతవకలను నివారించాలన్నారు. అలాగే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించరాదన్నారు. ఇన్సూరెన్స్ విధానంలో మార్పులు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని జయప్రదం చేద్దాం

కడప కల్చరల్ : కడప నగరంలోని జియోన్ వ్యాయామ కళాశాల నుంచి బుధవారం నిర్వహించనున్న శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకులు డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ కోరారు. మంగళవారం ఆయన రాజారెడ్డివీధిలోని తమ చర్చి కార్యాలయంలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. రావణకాష్టంలా నెలల తరబడి అరాచకాలకు నిలయంగా మారిన మణిపూర్‌లో వెంటనే శాంతి సాధనకు కృషి చేయాలని కోరుతూ నగరంలోని ఇతర క్రైస్తవ సంఘాలతో కలిసి ఈ శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల అక్కడ క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, చర్చిల కూల్చివేత పట్ల తాము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ సంధ్య సర్కిల్ వరకు వెళ్లి తిరిగి బయలుదేరిన చోటికి వస్తుందన్నారు. కడప నగరానికి చెందిన క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలతో కలిసి ర్యాలీ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ పోలీసు అధికారి

కడప ఎడ్యుకేషన్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వన్‌స్టాప్ సెంటర్ పోలీసు అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం కడపలోని శ్రీ హరి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తోపాటు బాల్య వివాహాల గురించి వన్ స్టాప్ సెంటర్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి వన్‌స్టాప్ పోలీసు అధికారి జ్యోతి, కేస్ వర్కర్ మాధవీలత, దేవిక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట ప్రకారం బాల్య వివాహాలు చేయడం పూర్తిగా నిషేధం అన్నారు. పెళ్లి వయసు రాకుండా మైనర్‌లకు వివాహం చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు తెలియచేశారు.

ఇంటెల్ సంస్థకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక

వేంపల్లె : ప్రముఖ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇంటెల్ టెక్నాలజీ కంపెనీకి ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కసిరెడ్డి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంటెల్ కంపెనీ ఉద్యోగ ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఎంపికైన నలుగురు విద్యార్థులు సీఎస్‌ఈ విభాగం నుండి రాజా మహేశ్వర్, సూరి, నిఖిల్, ఈసీఈ విభాగం నుండి పళ్ల రాధ, చోహాస్‌లు ప్రాంగణ నియామకమయ్యారు. వీరికి ఇంటర్న్‌షిప్ కాలం నుంచి రూ.40వేల వేతనం ఇవ్వనున్నారు. ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.చెంచురెడ్డి, వైస్ చాన్సలర్ విజయ కుమార్, ఆర్‌కే వ్యాలీ డైరెక్టర్ సంధ్యారాణి, ప్లేస్‌మెంట్ అధికారులు నాగరత్న కిశోర్, సుందర్, రవిబాబు, తదితర అధ్యాపక బృందం అభినందించారు.

24న విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మైలవరం మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నాగేంద్రకుమార్, గురుశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వం, క్విజ్, వ్యాసరచన, పదకేళీ పూరణము వంటి అంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24వ తేదీన వేపరాల ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించి 29వ తేదీన విజేతలకు నగదు, బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఈ నెల 25న జాతీయ సదస్సు

ఎర్రగుంట్ల : నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ఎర్రగుంట్లలోని ప్రభుత్వ ఐటీఐలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు.

29న వాహనాల వేలం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పన్నులు చెల్లించకుండా, నియమ నిబంధనల ఉల్లంఘనల కారణంగా పట్టుబడి ఇంతవరకు వాహన యజమానులు విడిపించుకోని వాహనాలను ఈనెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ గూడ్స్ వెహికల్స్ 26, ఆటోరిక్షాలు 22, మోటార్ సైకిళ్లు 75 వాహనాలు వేలం వేసేందుకు రవాణాశాఖ నోటీసులు జారీ చేసిందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 5000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

షరతులు లేకుండా సర్వీసు క్రమబద్ధీకరించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సర్వీసును షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలు, విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పొరుగు సేవల వారిని కాంట్రాక్టు పరిధిలోకి తీసుకొచ్చి రెండేళ్ల ప్రొబేషన్ పూర్తయిన తర్వాత వారిని కూడా క్రమబద్ధీకరించాలని కోరారు.

రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు.

ప్రైవేటు టీచర్లకు అవార్డులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించాలని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు కోరారు. పనికి తగ్గ వేతనం లేకపోవడంతోపాటు ఉద్యోగ భద్రత లేనప్పటికీ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత ప్రైవేటు టీచర్లకు ఉందన్నారు.

తగ్గిన టమాట ధరలు

- ప్రస్తుతం కిలో రూ.30 నుంచి రూ.50
- ఊపిరి పీల్చుకుంటున్న మధ్య తరగతి ప్రజలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న టమాటాలు

పులివెందుల రూరల్ : ప్రస్తుతం మార్కెట్‌లో టమాట ధరలు అదుపులోకి రావడంతో సామాన్యులు, పేదలు ఊపిరి పీల్చుకుంటున్నారు. సామాన్యుడికి అందనంత ఎత్తులో నిలిచిన టమాట ధరలు ఇప్పుడిప్పుడే భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. మూడు వారాల క్రితం టమాట కిలో రూ.150ల నుంచి రూ.200లు పలికాయి. మార్కెట్‌లో టమాట నాణ్యతను బట్టి కిలో టమాట రూ.30ల నుంచి రూ.50 వరకు పలుకుతున్నాయి. ఒకప్పుడు టమాట ధరలు గిట్టుబాటు కాక కొందరు రైతులు పంటలను మూగ జీవాలకు ఆహారంగా వేసేవారు. మరికొంతమంది రైతులు రోడ్లపైన పారవేసేవారు. టమాట ధరలు భారీగా పెరగడంతో కొంతమంది టమాటలకు ప్రత్యామ్నాయంగా చింత పండును ఉపయోగించేవారు. టమాట కొరతపై ప్రభుత్వం కూడా స్పందించింది. మదనపల్లె నుంచి పులివెందులకు టమాటలు తెప్పించి రూ.50ల చొప్పున మార్కెట్ యార్డు ద్వారా విక్రయించేవారు. టమాట పంట దిగుబడి లేకపోవడంతో మార్కెట్‌లో కనీవినీ ఎరుగని రీతిలో కొరత ఏర్పడింది. అయితే కష్టాలను ఓర్చుకుని సాగు చేసిన రైతుకు పంట పండి కాసులు కురిపించింది. ఏదోవిధంగా టమాట రైతులకు కాసులు రావడంతో గట్టెక్కారు. సాధారణంగా పంట బాగుంటే ధర బాగుండదు. నెల క్రితం సాగు చేసిన టమాట పంట ఇప్పుడిప్పుడే రైతులకు ఆదాయం ఇస్తోంది. వర్షాలు సమృద్ధిగా వస్తే టమాట అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పంట ఉంటుంది. ఇప్పుడిప్పుడే ధరలు అదుపులోకి రావడంతో సామాన్యులకు ఊరట లభిస్తోంది. టమాట ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

సెప్టెంబర్ 2 నుంచి శివాలయం విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శివాలయం

వేంపల్లె : వేంపల్లె గ్రామ పరిధిలోని చింతలమడుగుపల్లెలో సెప్టెంబర్ 2, 3, 4 తేదీలలో శివాలయ నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చింతలమడుగుపల్లె మాజీ ఎంపీటీసీ కంచర్ల గంగరాజు తెలిపారు. గ్రామస్తుల ఆర్థిక సహకారం, తన సొంత నిధులతో గ్రామంలో శివాలయం నూతనంగా నిర్మించామన్నారు. సెప్టెంబర్ 3న జరిగే పూజా కార్యక్రమాలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. 2వ తేదీన రాత్రి చెక్క భజన, 3వ తేదీన విగ్రహాల ఊరేగింపు, కోలాటం, 4వ తేదీన ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంపోస్ట్ యార్డు పనులను త్వరగా పూర్తి చేయాలి



కంపోస్ట్ యార్డులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : కంపోస్ట్ యార్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గుంత బజార్, పాత కంపోస్ట్ యార్డులలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో ఆయన కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గుంతబజార్‌లో జరుగుతున్న యూజీడీ పనులను తనిఖీ చేశారు. అలాగే పాత కంపోస్ట్ యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించి వెంటనే వాటిని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీప్రియ

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీప్రియ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె యవ్వనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహార లోపంవల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరిస్తూ ఆహార నియమాలు ఎలా పాటించాలో క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, పీఆర్‌ఓ బాలనారాయణ, సిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రావణ మాసంలో ప్రత్యేక బస్సులు

మైదుకూరు : శ్రావణ మాసం సందర్భంగా మైదుకూరు డిపో నుంచి అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శ్రావణ మాసంలో మంగళ, శనివారాల్లో అనంతపురం జిల్లాలోని కసాపురం, మురడి, నేమకల్లు క్షేత్రాలకు ఈ బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 26న శనివారం, 29న మంగళవారం, సెప్టెంబర్ 2న శనివారం, 4న మంగళవారం, 9న శనివారం, 12న మంగళవారం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఆంజనేయస్వామి క్షేత్రాలకు నడుపుతున్నట్లు తెలిపారు. రిజర్వేషన్‌తో కలిపి ఒక్కొక్కరికి రూ.1,270 టికెట్ ధర ఉంటుందని, మంగళవారం, శనివారాల్లో ఉదయం 5.30 గంటలకు మైదుకూరు డిపో నుంచి బస్సు బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరిగి చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట కాల్వలను పూర్తి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల కింద ఉన్న పంట కాల్వలను వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యం వి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టులలో నీరు ఉన్నప్పటికీ పంట కాల్వలు లేకపోవడంతో రైతులకు ఉపయోగపడని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 30, 31 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు కట్టా యాదయ్య, బాల చంద్రయ్య, వైపీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ప్రతిష్ట వార్షికోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వాసవీమాత ప్రతిష్ట వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి వేకువజామున సుప్రభాత సేవతో మొదలుకుని మంగళహారతి, గణపతి, రుద్రహోమం, నవగ్రహ చండీ హోమం పూర్ణాహుతి తదితర పూజాకార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అలాగే విశేషంగా అమ్మవారి మూల విరాట్‌ను వజ్రపుచీర, కిరీటంతో అలంకరించనున్నారు.